# కృతజ్ఞతార్పణ పండుగ

భారత దేశం నుండి వచ్చిన క్రైస్తవులకు కృతజ్ఞతార్పణ పండుగ క్రొత్తకాదు. ఆ దినాన క్రైస్తవులు సంఘానికి ప్రథమఫలాలు తీసుకొని వచ్చి దేవునికి అర్పిస్తారు. సంఘ పెద్దలు వాటిని వేలం వేసి, ఆ డబ్బును కానుకగా అర్పిస్తారు. కృతజ్ఞతార్పణ వెనుక ఉన్న ఉద్దేశ్యమేమంటే, మనకు వచ్చిన రాబడిలో మొట్టమొదటి భాగం దేవునిది అని చెప్పడం. మనకి ఉన్నవన్నీ దేవునివే గానీ మన ప్రథమఫలాల్ని దేవునికి అర్పించినప్పుడు దేవునికి మన జీవితంలో ప్రథమ స్థానాన్ని ఇస్తున్నామని చెప్తున్నట్లు.

ఈ కృతజ్ఞతార్పణ పండుగ అనేక దేశాల్లో వివిధ రకాలుగా జరుపుకుంటారు.

గ్రీసు దేశస్తులు చాలా రకాల దేవుళ్ళను, దేవతలను పూజించేవారు. ప్రతి సంవత్సరం ఆకులురాలే కాలంలో థెస్మోఫోరియా అనే పండుగలో దెమెత్రియను పంటల దేవతను పూజిస్తారు.

రోమీయులు సెరిలియ అనే పండుగను సెరెస్ అనే పంటల దేవత గౌరవార్ధం చేస్తారు. ఈ పండుగను ప్రతిసంవత్సరం అక్టోబరు 4వ తేదీన జరుపుకుంటారు. ఆ పండుగలో పండులను సెరెస్ కు అర్పిస్తారు.

పురాతన కాలంలో చైనీయులు చంగ్ చుయి అనే కోత పండుగను 8వ నెల 15వ తేదీన ఆచరించేవారు. దీన్ని చంద్రుని పుట్టినరోజుగా జరుపుకొంటూ, పసుపుగా చంద్రాకారంలో "మూన్ కేకులు" చేసుకునేవారు.

యూదులు "సుక్కోతు"ను కృతజ్ఞతార్పణ పండుగగా ఆచరిస్తారు. సుక్కోతును 3000 సంవత్సరాలనుండి ఆచరిస్తూవస్తున్నారు. సుక్కోతును రెండు రకాలుగా పిలుస్తారు. 1. పర్ణశాలల పండుగ (హాగ్ హా సుక్కోతు), 2. పంట కూర్పు పండుగ (హాగ్ హా ఆసిఫ్). సుక్కోతు హీబ్రూ నెల అయిన తిష్రీ నెల 15వ తేదీన ఆరంభించి 8 రోజులపాటు జరుపుకుంటారు.

మోషే, ఇశ్రాయేలీయులు ప్రమాణ దేశము చేరక ముందు 40 సంవత్సరాలు ఎడారి ప్రాంతంలో తిరుగులాడినప్పుడు పర్ణశాలల్లో నివసించిన దానికి జ్ఞాపకార్ధంగా సుక్కోతును జరుపుకుంటారు.

పురాతన ఐగుప్తీయులు వారి వ్యవసాయ, ఫలదీకరణ దేవుడైన "మిన్" గౌరవార్ధం కృతజ్ఞత పండుగ జరుపుకునేవారు. ఈ పండుగ ఐగుప్తీయుల కోతకాలమైన

వసంత ఋతువులో జరుపుకునేవారు. ఈ పండుగ సందర్భంగా ఒక ఊరేగింపు జరుపుకునేవారు. దానిలో ఫరో పాల్గొనేవాడు.

అమెరికా దేశంలో మొట్ట మొదట కృతజ్ఞతార్పణ పండుగ జరుపు కున్నవారు యాత్రికులు. వారు 1609లో ఇంగ్లాండులో మతద్వేషానికి గురై, హాలెండుకు తరలిపోయారు. అక్కడనుండి 1620లో "మే ఫ్లవర్" అనే ఓడలో అమెరికా వచ్చారు. అమెరికాలో మొదటి చలికాలం వారికి చాలాకష్టతరమైంది. చలి, మంచు, వర్షం వల్ల తినడానికి సరైన తిండిలేక, చాలా కష్టపడ్డారు. 100 మందిలో కేవలం 50 కంటే తక్కువ మంది బ్రతికారు. అయితే కొంత మంది స్థానిక అమెరికన్ ఇండియన్ లు వీరిని ఆదుకొనటం ద్వారా వారు బలపడ్డారు. 1621 సంవత్సరంలో యాత్రికులు పడిన కష్టపరిస్థితులనుండి దేవుడు వారిని బయటకు తెచ్చి వారికి మంచి కోతను అందించినందుకు గాను వారు ఈ కృతజ్ఞత పండుగ జరుపుకున్నారు. ఆ తరువాత నుండి ప్రతి సంవత్సరం వారు కృతజ్ఞత పండుగను జరుపుకున్నారు. 1817లో న్యూయార్క్ రాష్ట్రంలో కృతజ్ఞత దినాన్ని ఒక సాంవత్సరిక ఆచారంగా ఆచరించటం మొదలుపెట్టారు. ఆ తరువాత మరికొన్ని రాష్ట్రాలు కృతజ్ఞత దినాన్ని ఆచరించడం మొదలు పెట్టాయి. 1863లో ప్రసిడెంట్ అబ్రహాం లింకన్ నవంబరు నెలలో 4వ గురువారాన్ని కృతజ్ఞతాదినంగా ప్రకటించారు. ఈ దినాన్న అందరూ వారివారి కుటుంబాలకు చేరుకొని, సాంప్రదాయకమైన వంటకాలను వండుకొని ఆనందిస్తారు.

క్రైస్తవులంగా మనకి ప్రతి దినం కృతజ్ఞతాదినంగా ఉండాలి. ఎందుకంటే దేవుడు మనకు చేసిన మేళ్ళకు మనమేమి తిరిగి ఇవ్వలేము, గాని ఆయనకు కృతజ్ఞత కలిగిజీవించగలం. దేవుడు కోరుకొనేది కూడా అదే.

పాల్ & హెఫ్సీబా సుధాకర్ సుంకరి